www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 జనవరి 2023
5
తిరుపతి

25న వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో ఉన్న అమరావతి జూనియర్ కాలేజ్ లో ఈ నెల 25వ తేదీన పదోతరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ ప్రసూన తెలిపారు. అమరావతి కాలేజీ, లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వ్యాసరచన పోటీలకు శ్రీకాళహస్తి గ్రామీణ, పట్టణ ప్రాంత పదవ తరగతి విద్యార్థులు అర్హులని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయడం ఉన్నత చదువులుకు ఆర్థిక సాయమందించడం జరుగుతుందని చెప్పారు. శ్రీకాళహస్తి ప్రాంత పదో తరగతి విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొని వారి ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. ట్రస్ట్ సభ్యుడు పసుపులేటి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఈనెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్ల నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కాలుష్యనియంత్రణ బోర్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్‌లతో అవగాహన జరిగింది. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం వారు ఏర్పాటు చేసిన సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పర్యావరణ శాఖ వారి ఆదేశాలమేరకు 26 గణతంత్ర దినోత్సవం రోజు నుంచి పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్, ప్లాస్టిక్ బెలూన్స్, ప్లాస్టిక్ జెండాలు, ప్లాస్టిక్ క్యాండిస్టిక్స్, ప్లాస్టిక్ ఐస్‌క్రీమ్స్ స్టిక్స్, అలంకరణకోసం వాడే పాలిస్టరిన్ (థర్మోకోల్) వినియోగాన్ని నిషేధించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సి నిషేధంపై పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు, శ్రీకాళహస్తి, పుత్తూరు, సూళ్ళూరుపేట మున్సిపల్ కమిషనర్లు బాలాజి నాయక్, కె.ఎల్.ఎన్ రెడ్డి, నరేంద్ర కుమార్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలు రోడ్డుపై చేశారా.? గాల్లో చేశారా..?

సిఐటియు వినూత్న నిరసన

ప్రజాశక్తి - నాయుడుపేట

జీవో నంబర్ 1రద్దు చేయాలని, ఇది అమలైతే ఏ సమస్యకైనా ప్రశ్నించే హక్కు ఉండదని, నిరసన తెలపడానికి వీల్లేదని తెలియజేసేలా సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం 'శిరోముండనం' చేసుకుంటూ వినూత్న నిరసన తెలిపారు. నాయుడుపేటలోని గాంధీ మందిరం వద్ద సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించడం సరికాదన్నారు. జీవో నంబర్ ఒకటి పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గపు జీవోలు విడుదల చేయడం అన్యాయమన్నారు. ఎపుడో బ్రిటీష్ కాలం నాటి జీవోలను ఇపుడు అమలు చేయడం బడుగు బలహీన వర్గాల అణచివేతకనేని విమర్శించారు. రోడ్లపై ర్యాలీలు, రోడ్డుషోలు, బహిరంగసభలు నిర్వహించడం నేరమని దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం కోసం పాదయాత్రలు రోడ్డుపై చేశారా? గాల్లో చేశారా? అని ఎద్దేవా చేశారు. ఇలాంటి జీవోలు రాజ్యాంగ స్ఫూర్తికి విఘాగం కలిగిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్‌బాబు, కె.విజయమ్మ, బి.గోపాల్, చంద్రకళ, బాలచెంగయ్య, ఏసు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో శిరోముండనం చేస్తూ...

అలిపిరి వద్ద టిడిపి మొక్కులు

తిరుపతి టౌన్: టిడిపి యువ నాయకులు నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద 400 టెంకాయలు కొట్టారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధుబాబు ఆధ్వర్యంలో టౌన్‌క్లబ్ ఎన్టీఆర్ కూడలి వద్ద కేకును కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, పార్లమెంట్ అధ్యక్షులు నరసింహులు పాల్గొన్నారు. ఈనెల 27న యువగళం పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని దేవదేవుని కోరినట్లు తెలిపారు. జీవో నంబర్ 1 తీసుకొచ్చి అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు.

'శ్రీవాణి' నిధులు దుర్వినియోగం కాలేదు

అందిన విరాళాలు రూ.650 కోట్లు
2,068 ఆలయాలు నిర్మించాం
దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మొద్దు
మీడియాతో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీవాణి నిధులు దుర్వినియోగం అయ్యాయని సోషల్ మీడియాతో చేస్తున్న దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మరాదని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. ఇప్పటివరకూ శ్రీవాణి ట్రస్టుకు రూ.650 కోట్లు విరాళాలు అందాయన్నారు. శ్రీవారి వైభవాన్ని నలుదిశాలా వ్యాప్తిచేసేలా రాష్ట్రంలోని 26 జిల్లాలతో పాటు తెలంగాణా, పాండిచ్చేరి, కర్నాటక రాష్ట్రాలతో కలిపి మొత్తం 2,068 ఆలయాల నిర్మాణం జరుగుతోందన్నారు. తిరుమల అన్నమయ్యభవనంలో సోమవారం ఈవో మీడియాతో మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారంలో భాగంగా శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టును 2019లో ఏర్పాటు చేశామన్నారు. లక్ష రూపాయల లోపు విరాళం అందించే దాతలకూ వర్తింపజేయాలనే ఉద్దేశ్యంతో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేలు విరాళం అందించే దాతలకు ఒక బ్రేక్ దర్శన టికెట్ జారీ చేస్తున్నామని వివరించారు. ఈ ట్రస్టు నిధులతో ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, ఆలయాల ధూపదీప నైవేద్యాలకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ సహకారంతో 2019వ సంవత్సరానికి ముందు 502 ఆలయాలు నిర్మించినట్టు వెల్లడించారు. అనంతరం ఈ ఫౌండేషన్ సహకారంతో 320 ఆలయాల నిర్మాణానికి రూ.32 కోట్ల శ్రీవాణి నిధులు మంజూరుచేశామని, వీటిలో 110 ఆలయాలు ఒకనెలలో, 210 ఆలయాలు 6 నెలల్లో పూర్తవుతాయని చెప్పారు. రాష్ట్ర దేవాదాయ శాఖ సౌజన్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో 932 ఆలయాల నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లు కేటాయించామని, దశలవారీగా ఇప్పటివరకు రూ.25 కోట్లు మంజూరుచేశామని వివరించారు. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నెవేద్యాల కోసం ప్రతినెలా ఆలయ కమిటీ బ్యాంకు అకౌంట్‌లో రూ.5 వేలు జమ చేస్తామని, ఇందుకోసం రూ.12.50 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణకు గాను ప్రతినెలా రూ.2 వేలు ఆలయ కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్టు వివరించారు. ఆలయాల నిర్మాణం జరుగుతున్నపుడు, పూర్తయిన తరువాత ఆలయ నిర్వహణను టిటిడి బందం తరచూ తనిఖీ చేస్తుందని తెలిపారు.

కాగా, శ్రీవాణి ట్రస్టుకు సంబంధించి 50 శాతం నిధులను టిటిడి జనరల్ అకౌంట్‌కు బదిలీ చేస్తున్నారని, ఆదాయం కోసమే శ్రీవాణి దర్శన టికెట్లు ఇస్తున్నారని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. శ్రీవాణి ట్రస్టుకు ప్రత్యేకంగా బ్యాంకు అకౌంటు ఉందని, అందులోనే విరాళాలు జమ అవుతాయని చెప్పారు. టిటిడి నుండి సొమ్ము ప్రభుత్వానికి అందే ప్రసక్తే లేదన్నారు. మరింత ఎక్కువమంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు వీలుగా శ్రీవాణి ట్రస్టు దాతలకు ఇచ్చే బ్రేక్ దర్శన టికెట్లను 1000కి తగ్గించడం జరిగిందన్నారు. ఇందులో 750 టికెట్లు ఆన్‌లైన్‌లో, 250 టికెట్లు ఆఫ్‌లైన్‌లో రేణిగుంట విమానాశ్రయంలో జారీ చేస్తున్నట్టు చెప్పారు. మీడియా సమావేశంలో టిటిడి జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహకిషోర్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంగళంలో సీఏ ఇన్‌స్టిట్యూట్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎంతో ప్రతిష్టాత్మక ఇనిస్టిట్యూట్ అయిన ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా(ఐసిఏఐ) నిర్మాణానికి సోమవారం ఐసిఏఐ అధ్యక్షులు డెబాసిస్ మిత్ర, ఉపాధ్యక్షులు అనికేట్ సునీల్ తలాటి ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీలో గల తుడా లేఔట్ లో భూమి పూజ జరిగింది. అతి తక్కువ ఖర్చుతో సిఏ కోర్సును పూర్తి చేసి కీలకమైన రంగాలకు సేవలందిస్తున్నామని ఐసిఏఐ మాజీ అధ్యక్షులు దేవరాజు రెడ్డి తెలిపారు. ఈ ఐసిఏఐ కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సంబంధించిందని తెలిపారు. ఈ ఇనిస్టిట్యూట్ ను దాదాపు 10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. ఈ ఇనిస్టిట్యూట్ నిర్మాణం పూర్తయితే బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విజయవాడ, గుంటూరుకు వెళ్లి సిఏ చదవాల్సిన అవసరం ఉండదన్నారు. ఐసిఏఐ ఇనిస్టిట్యూట్ ద్వారా ప్రస్తుతం 9 లక్షలకు పైగా విద్యార్థులు సిఏ కోర్సును అభ్యసిస్తున్నారన్నారు. కోర్సులను పూర్తి చేసిన వారు దాదాపు నాలుగు లక్షలకు పైగా వివిధ కంపెనీలలో వారి సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బ్రాంచ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కమిటీ చైర్మన్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డి. ప్రసన్నకుమార్, ఎస్ఐఆర్ సి ఆఫ్ ఐసిఏఐ ఛైర్మన్ టి.చిన్నమస్థాన్, సదరన్ రీజియన్ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్స్ రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జిల్లాను కుష్టువ్యాధి రహితంగా మారుద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ కుష్టువ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కషి చేద్దామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య అధికారి కార్యాలయంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరగనున్న స్పర్శ కుష్టి వ్యాధి అవగాహన కార్యక్రమం పోస్టర్లను సోమవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 నుండి జిల్లాలో ఈ స్పర్శ కుష్టి వ్యాధి అవగాహన కార్యక్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, రూరల్, అర్బన్ డెవలప్మెంట్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, సోషల్ జస్టిస్, ఎంపవర్మెంట్ శాఖల తరపున గ్రామ, పట్టణ స్థాయిలో సభల ద్వారా సమాజంలో కుష్టివ్యాధి రూపుమాపాలని అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిఎంహెచ్వో డాక్టర్ యు శ్రీహరి మాట్లాడుతూ పట్టణాలలో అనుమానిత కుష్టి వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోస్టు ఎయిడ్స్ టీవీ అధికారి డాక్టర్ అరుణ సులోచన దేవి, డాక్టర్ శాంతి కుమారి, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ శేఖర్, డాక్టర్ మధుబాబు, ఎస్వీ రమణ, డాక్టర్ కిరణ్ నాయక్, సుశీల దేవి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు : సిపిఐ

సూళ్లూరుపేట : 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఎఐటియుసి నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగేంద్రబాబు అన్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు జరిగాయి. టిడిపి పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, మేడా సాయి, పెంచలయ్య, సిపిఎం నాయకులు పద్మనాభం, పిడిఎస్‌యు లోకేష్, ఎడిపిఎస్ అధ్యక్షులు యరబోతు సుబ్రమణ్యం మద్దతు తెలిపారు.

27న తిరుపతికి 'ప్రత్యేక' యాత్ర

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా, విభజన హామీలైన వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి కి నిధులు, కడప ఉక్కు కర్మాగారం, కేంద్రీయ విద్యాసంస్థలైన గిరిజన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఐఐటి, ఐఐఐటి, ఎన్ ఐటి లాంటి విద్యాసంస్థల నిర్మాణానికి నిధుల కేటాయింపు, రామాయపట్నం పోర్ట్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, రాజధాని నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, విభజన హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్స్ తో చేపట్టిన యాత్ర 27వ తేదీ శుక్రవారం తిరుపతికి వస్తున్న సందర్భంగా శ్రీనివాస ఆడిటోరియంలో నిర్వహించే సభకు సహకరించాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజారెడ్డిని కలిసి విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి, కార్యదర్శి మాధవ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్, కార్యదర్శి బండి చలపతి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి, ఎన్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు నగేష్, పిడిఎస్‌యూ కన్వీనర్ ఆదిశేషు, పిడిఎస్ఓ కన్వీనర్ ఆర్. ఆశ, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉరుకుంద, శివ, పథ్వి, ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల్లో స్ప్రింగ్ డేల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వైయస్సార్ కడప జిల్లాలోని జయరాజ్ గార్డెన్స్ లో ఈనెల 21, 22న జరిగిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో 26 జిల్లాల నుండి 78 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇందులో తిరుపతి-కరకంబాడి మార్గంలోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాత పరీక్షలో, ప్రయోగ పరీక్షలలో అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారని విద్యా సంస్థల చైర్మన్ కే ఎస్. వాసు తెలిపారు. ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ రామచంద్రయ్య స్ప్రింగ్ విద్యార్థులు బి.అక్షత్ రెడ్డి, బి. యశ్వంత్ రెడ్డి, ఇ. సాయి సాహిత్ లకు బహుమతులు అందజేశారన్నారు. ప్రయోగాత్మక పరిశీలనలను ఇస్రో శాస్త్రవేత్త బాలమురళి ప్రత్యేకంగా అభినందించారు.

చదువు జ్ఞానం పెంపొందించాలి : జేఈవో

ప్రజాశక్తి - క్యాంపస్

చదువు ర్యాంకులకు పరిమితం కారాదని, జ్ఞానం పెంపొందించేలా ఉండాలని జెఇఒ సదాభార్గవి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడపబడుతున్న శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం నందు నూతన జాతీయ విద్యా విధానం పైన ఒకరోజు కార్యాశాల సోమవారం జరిగింది. ముఖ్య అతిథులుగా తిరుమల తిరుపతి దేవస్థానముల జేఈవో సదా భార్గవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేద విశ్వవిద్యాలయం తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క మానస పుత్రికని, దేవస్థానం యొక్క అన్ని విద్యాసంస్థల్లో ఎన్‌ఈపి గూర్చి కార్యాశాలలు పెట్టాలని ఆలోచన చేస్తున్నామని అన్నారు. సాంప్రదాయ వారసత్వ విద్యలలో ఈ కొత్త విద్యాపాలసీని కలపడం చాలా సాహసమని ఎన్‌ఏపీలో సంస్కృతం తీసుకురావడం వలన పరిశోధన విభాగంలో అవకాశాలు మెరుగవుతాయని, చదువు ఎప్పుడు జ్ఞానం పెంపొందించేలా ఉండాలని, కానీ చదువు ర్యాంకుకు పరిమితం కాకూడదని, జీవనభతికి మానసిక వికాసానికి జ్ఞాన పురోగతికి దోహదం చేయాలని అన్నారు. పూర్వం గురుకుల వ్యవస్థలో అర్థవంతమైన చదువు ఉండేదన్నారు. విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ కొత్త జాతీయ విద్యా విధానంలో విద్యార్థులు వారు ఇష్టపడిన విద్యను వారే ఎంచుకోవచ్చని, ఏ సంవత్సరం విద్య పూర్తయితే ఆ సంవత్సరం అది పూర్తయినట్లుగా ప్రమాణ పత్రం ఇస్తారని వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో ఉన్న వేద, వేదాంగ, వేదభాష్య, ఆగమ, పౌరోహిత్య విభాగాలలో ఈ యొక్క కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడానికి ఈ కార్యశాల ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలానే విశ్వవిద్యాలయం అతిత్వరలో న్యాక్ అక్రిడేషన్ కు వెళ్లే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కులసచివులు డాక్టర్ రాధేశ్యామ్, డీన్ డా. డి. పి వై యాజులు, సంయోజకలు డాక్టర్ తారక రామ్ కుమార్ శర్మ, పీఆర్వో డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

నేడు రెండు రోజుల సదస్సు

వేద విశ్వవిద్యాలయంలో రేపటి నుండి రెండు రోజులపాటు వేద భాష్య విభాగంలో జాతీయ స్థాయిలో సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమానికి చెన్నైకి చెందిన సత్యవాగీశ్వర ఘనపాఠి పాల్గొంటారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి : మేయర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని సమస్యల పరిష్కారానికి వస్తున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్‌కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్‌కు 13 ఫిర్యాదులు, స్పందనకు 16 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్పొరేటర్ నరసింహాచారి వినతిపత్రం ఇస్తూ తిరుపతి నగరంలో మృతిచెందుతున్న బిచ్చగాళ్లు, అనాథ మృతదేహాలను తరలించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కొరమీనగుంట దేవుడు కాలనీలో తెలుగుగంగ నీటి పైపులు వేయాలని సిపిఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, ఎంఇ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెవిల్ వర్మ పాల్గొన్నారు.

'స్పందన'కు 112 అర్జీలు : కలెక్టర్

'స్పందన'లో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జేసీ డికె బాలాజీ, డిఆర్ఒ శ్రీనివాసరావు, గాలేరు నగరి సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండ రామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 112 అర్జీలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

డ్రైనేజీ కాల్వలు నిర్మించాలి : సిపిఎం

తిరుపతి నగరంలో 34 ,44డివిజన్ సుందరయ్య నగర్ ప్రాంతంలో పాడైన డ్రైనేజీ కాలవలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, నగర కమిటీ సభ్యులు ఎం. నరేంద్ర మాట్లాడుతూ సుందరయ్య నగర్ నాలుగో వీధిలో పాడైన డ్రైనేజీ కాలువలు బాగు చేయాలని అనేక సందర్భాల్లో సచివాలయము లో ఫిర్యాదు చేసిన, మున్సిపల్ స్పందన కార్యక్రమంలో పదేపదే చెప్పిన సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కాలువలు పాడైపోవడం వల్ల డ్రైనేజీ నీళ్లు తెలుగు గంగ నీటిలో కలుషితమై పోతున్నాయని, తద్వారా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందన్నారు. గత పది సంవత్సరాలు నుండి వీధి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్ లకు వినతి పత్రం సమర్పించారు. వెంటనే సంబంధిత అధికారులకు పాడైన కాలువలు నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే వేణు, పి.బుజ్జి,కాలనీ వాసులు జయన్న, సోము తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం పంచాయతీలో చెంచువారి గిరిజనులకు తాగునీటి సమస్య లేకుండా ఆదివారం రాత్రి బోరు వేశారు. దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య మంత్రి ఆర్‌కే రోజాను కలిసి నీటి కష్టాలపై వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన మంత్రి చెంచువారి గిరిజన కాలనీలో తాగునీటి బోరు వేయించారు. కార్యక్రమంలో వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మి చైతన్య , ఏఈ రామ్‌మోహన్ , ఎంపీటీసీ కనకమ్మ, వైకాపా నాయకులు బాబు, మాధవరాజు, అంబేద్కర్ సేన యువ నాయకులు పుష్పరాజ్ , జయ, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ వెంకటేష్ ,కృష్ణ , శ్రీనివాసులు, జయరామయ్య, శ్రీనివాసులు, నాగమ్మ, అరుణ, గీత, శారదా, శాంతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు,.

27న లోకేష్ పాదయాత్ర జయప్రదం చేయాలని పూజలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 27 వ తేదీన యువగళం మహా పాదయాత్రను జయప్రదం చేయాలని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ జీడీ ధనపాల్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరికాయలను కొట్టారు. నారా లోకేష్ జన్మదిన సందర్భంగా పుట్టినరోజులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పార్లమెంటరీ టీఎన్‌టీసీ అధ్యక్షులు రావిళ్ళ మాధవనాయుడు, గాలి గోపీనాథ్, రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, చీరల మోహన్, హమీద్‌బాషా, ఎస్సీసెల్ అధ్యక్షులు వేలు, గుర్రప్ప వెంకటేష్, రమేష్, తడుకు సర్పంచి బొబ్బిలి, కౌన్సిలర్ కేశవులు, కృష్ణ కుమార్, మహిళా నాయకురాలు నాగరత్నం. మోహన. ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, మురళీ, పార్తీబన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో మందుల పిచికారీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తిరూరల్: రైతులు వ్యవసాయానికి డ్రోన్లను ఉపయోగించి పురుగుల మందులు పిచికారీ చేయడంతో సాగు ఖర్చు తగ్గుతుందని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త ఎస్. శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ముచ్చివోలు గ్రామంలో సోమవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం (తిరుపతి) ఆధ్వర్యంలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (న్యూఢిల్లీ) వ్యవసాయ డ్రోన్ వినియోగాన్ని రైతులకు చేరవేసే బాధ్యత రాస్ కషి విజ్ఞాన కేంద్రానికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కూలీల సమస్య ఉండదని, తక్కువ సమయంలో పిచికారీ చేయవచ్చని, సాగుకు అయ్యే ఖర్చు ఎంతో వరకు తగ్గుతుందని తెలిపారు. 20 ఎకరాల వరి పంటలో డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త రామ్ కుమార్, శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, గ్రామంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయాలు ఓ వరం



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని విశ్వం విద్యా సంస్థలకు జవహర్ నవోదయ విద్యాలయ చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ డాక్టర్ ఏ కాశయ్య, నవోదయ విద్యాలయ అధ్యాపక బృందం విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యతోపాటు కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను నవోదయలో అందిస్తున్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది ఐపీఎస్, ఐఏఎస్ వంటి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడితే, మరెందరో విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు, ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్వ నాథ్ రెడ్డి మాట్లాడుతూ గత 33 సంత్సరాలుగా తమ విద్యాసంస్థలలో నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ పొంది నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించి దేశ స్థాయిలో అత్యున్నత అధికారులుగా, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి ఉన్నారని తెలిపారు. సమాచారం కోసం 9399976999, 8688888802 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-గూడూరు: ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించి నడపాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాలు ఎక్కువ మంది పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. అధిక వేగం ప్రాణానికి ముప్పు అని సూచించారు. సీఐలు మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం చట్టపరంగా నేరమన్నారు. కార్యక్రమంలో గూడూరు రూరల్ సీఐ దశరథ రామారావు, ఒకటో పట్టణ సీఐ హజరత్ బాబు, రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్‌రావు , రూరల్ ఎస్సై బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: చిల్లకూరు బైపాస్‌లో ఎస్సై గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సులు ఉండాలని, ఆటో డ్రైవర్లు తమ వాహనాలలో పరిమితంగా ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు.. నేతాజీ సుభాష్‌చంద్రబోస్

గూడూరు రూరల్: వీఎస్ఆర్ పాఠశాలలో..

నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురంలో...

పాకాలలో...

గూడూరు రూరల్: వీఎస్ఆర్ పాఠశాలలో..

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వీఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణంరాజు మాట్లాడుతూ నేతాజీ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నేతాజీ బాటలో నడుస్తామని..దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం ప్రయత్నం చేస్తామని .. మంచి పౌరులుగా ఎదుగుతామని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురం: ఎస్.ఎస్‌పురం ఉన్నత పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు భూపాల్, ఉపాధ్యాయులు రవి, బాబు, కమ్మర శ్రీదేవి, రంజిత్‌కుమార్, వెంకటేశ్వర్లు, భూపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాల: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దిన్‌బాషా అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నేతాజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌వీ రమేష్ కుమార్, ఈశ్వర బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్వాతంత్ర్య పోరాటయోధుల్లో ఒకరు సుభాష్ చంద్రబోస్ అని తహశీల్దారు అజ్మీత్తుల్లఖాన్ అన్నారు. సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రటానికి పూలమాల వేసి నివాళు లలర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణ, సర్వేయర్ శరత్, వీఆర్‌వోలు ఆదిశేషయ్య, పెంచలయ్య, మేకలయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సోమవారం మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీలో జాతీయ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. నేతాజీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా చిన్నరెడ్డిబాబు వివరించారు. సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువతరం నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, సెక్రటరీ రవి, ట్రెజరర్ వి.వి.రమణరావు, నాయకులు రామకృష్ణ, మనోహర్, గంగాధారం, చంద్ర, సిద్దారెడ్డి, మైనారిటీ నాయకుడు మహబూబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి మంగళం: జాతీయ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో ..

ఘనంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా సోమవారం కొత్తపల్లి గ్రామంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ తిరుపతి పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు సుజాతమ్మ ఆర్థిక సహాయంతో 60 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 300 మందికి అన్నదానం నిర్వహించారు.

కేవీబీపురం: కేవీబీపురంలోని సాయిబాబా ఆలయం వద్ద లోకేష్ 40వ జన్మదినం సందర్భంగా పూజలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షులు రామానుజులనాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు.

యర్రావారిపాలెం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మిట్టపైన శివాలయంలో సోమవారం మండల కమిటీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ ఆధ్వర్యంలో జరిగాయి.

గూడూరులో....

బీఎన్‌కండ్రిగ: ఆర్టీసీ బస్టాండు సమీపంలో టీడీపీ మండలాధ్యక్షులు సుధాకర్‌నాయుడు అధ్యక్షతన నారా లోకేష్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. s

దొరవారిసత్రం

చిన్నగొట్టిగల్లు: నారా లోకేష్ జన్మదిన వేడుకలను సోమవారం భాకరాపేట టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ మురళీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.

శ్రీకాళహస్తి: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు పట్టణంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

పుత్తూరు టౌన్: నారా లోకేష్ జన్మదినాన్ని సోమవారం ఎంబీరోడ్డులో టీడీపీ నాయకులు పోతుగుంట విజయ్‌బాబు ఘనంగా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

గూడూరు : గూడూరు పట్టణంలో టీడీపీ కార్యాలయంలో టీఎన్ఎ.ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోకేష్ బాబు పుట్టినరోజు వేడుకల్లో గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు సబ్ ప్లాన్ కాలాన్ని 10 సంవత్సరాల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర దళిత నాయకులు, గిరిజన రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం సీఎం కత నిశ్చయంతో పనిచేస్తున్నారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ కు ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకుడు మల్లారపు మధు, గిరిజన రాష్ట్ర అధ్యక్షులు మూడే హరి చౌహన్ నాయక్, బిసి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజు, నాగేంద్ర, చంద్రశేఖర్ నాయక్, బాల, రాజానాయక్, దొరస్వామి నాయక్ పెద్ద సంఖ్యలో దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి -సత్యవేడు: ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం అన్నారు. స్థానిక సత్యవేడు తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల గౌరవ అధ్యక్షులు రమేష్, డప్పు కళాకారుల సంఘం మండల నాయకులు అరుల్, మునస్వామి, అల్లాసమీ, మురుగన్. దానంజీయాన్, రత్నయ్య, డయాలన. చంద్రయాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యస్థితిపై అవగాహన ఉండాలి

తిరుపతి టౌన్ : మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడెర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కు వారి విధులలో భాగంగా ప్రజలకు అందించే విస్తరణ సేవలపై శిక్షణా కార్యక్రమన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ యు. శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఎల్ హెచ్ పి, సిహెచ్ఓ లు ప్రతి వైస్సార్ హెల్త్ క్లినిక్ పరిధి లో ప్రజలందరి ఆరోగ్య స్థితి తెలుసు కొనుటయే కాక, వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని తెలియజేసారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించు కొన్న వారికి ఫాలో అప్ సేవలు అందించాలని సూచించారు. రక్త హీనత గల వారిని గుర్తించి వారికి చికిత్స అందించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వికాస్, డేనియల్ రాజ్, తేజస్విని, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా బొప్పన శ్రీనివాస్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం:

ఇంపాక్ట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా వరదయ్య పాలెంకు చెందిన బొప్పన శ్రీనివాస్ గుర్తింపు దక్కించుకున్నారు. ట్రైన్ ద ట్రైనర్ పేరుతో నెలరోజుల పాటు సాగిన శిక్షణ అనంతరం ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు టొబాకో బోర్డ్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ బాబు ఐఏఎస్ చేతుల మీదుగా ధవ పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస నైపుణ్యాల ద్వారా విద్యార్థులు, యువతలో గొప్ప మార్పు తీసుకురావాలని ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు సాగిస్తున్న చైతన్య ఉద్యమంలో భాగస్వామి కావడం తనకు ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజాన్ని ఉన్నతస్థితి వైపు నడిపించడానికి పూర్తి స్థాయిలో కషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ కదం కష్ణమూర్తి, నిర్వాహకులు రవి చల్లా, వీరాంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వేణుంబాకం పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని వేణుంబాకం గిరిజన కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ప్రభుత్వం అమలు చేసిన మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు భోజనం విషయంలో అవకతవకలు జరిగినా.. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

ప్రజాశక్తి-ఓజిలి: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి అందేలా గ్రామ వాలంటీర్లు చొరవ తీసుకోవాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పని చేయాలని ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు.రవీం ద్రరాజు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో వాలంటీర్లు, కొత్తగా నియమితులైన జగనన్న సచివాలయం కన్వీనర్లకు సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లకు కేటాయించిన ప్రతి 50 కుటుంబాలలో అర్హులైన ప్రతిఒక్కరికీ పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని తెలియజేశారు. ఒక్కొక్క వాలంటీర్లకు ఇద్దరు చొప్పున గహసారథులను నియమించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్, జేసీఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, ఇన్‌ఛార్జి, ఈవోపీఆర్డీ సిరాజ్, సచివాలయ కన్వీనర్ మనోహర్ రాజు, వైసీపీ సీనియర్ నాయకులు ముమ్మడి సుబ్బారావు యాదవ్, కొండూరు దామోదర్ రాజు, కొండూరు వెంకట సుబ్బరాజు, తిరుపాలయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

మద్యం దుకాణం పక్కనే అనధికార విక్రయాలు

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని తాల్వాయిపాడు గ్రామం వద్ద జాతీయ రహదారికి సమీపంలో ఉన్న వైన్‌షాప్ పక్కనే ఓ కూల్ డ్రింక్ షాప్ ఉంది. ఇలా మద్యం దుకాణం పక్కనే కూల్‌డ్రింగ్ దుకాణం ఉండరాదని నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబులు అక్కడే మద్యం తాగుతూ ఒకరికొకరు గొడవలు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PUTTUR
CMA NO.1/2020

A.Vijaya Nirmala. ...Appellant

Vs

P.Kasthuramma and Others. ...Respondents

NOTICE TO THE RESPONDENTS NO 5,7, AND 11

Respondent No.5: Manjula, D/o. P.Kasthuramma, Kakavedu Village & Post, Nagari Mandal, Chittor Dt.
Respondent No.7: Vasu, S/o Bhupathi Reddy, Kattamanchi, Chittor Dist.
Respondent No.13: P.Latha D/o Late P.Venugopal Reddy, D.No.21-10-430, RTC Colony, Ex TTD, Kranthi Nagar, Jeevakona, Tirupati.

Where as the Appellant filed this appeal against you and others and the case is posted for you appearance on 25.1.2023 for your appearance by advocate. If you failed to do so the case will be decided in your absence.

T.M.PURUSHOTHAM
Advocate for Appellant.

రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వేపగుంట-ఏకాంబరకుప్పం మధ్య రైల్వేస్టేషన్ మధ్య ఉన్న ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మతిచెందినట్లు రేణిగుంట రైల్వే ఎస్సై రవి తెలిపారు. కుడి చెయ్యిపై గేద తల పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు.

నివాస స్థలాల్లో మద్యం దుకాణాన్ని తొలగించండి

ప్రజాశక్తి -రేణిగుంట: నివాస స్థలాల వద్ద మద్యం దుకాణాన్ని తొలగించాలని రేణిగుంటలోని పాంచాలినగర్ 4వ వీధిలోని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు కార్తీక్, మురళీ ఆధ్వర్యంలో సోమవారం రేణిగుంట డి.ఎస్.పి. రామచంద్ర, రేణిగుంట అర్బన్ సి.ఐ. సుబ్బారెడ్డిలకు వినతిపత్రాలు అందించారు.

ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- పిచ్చాటూరు: ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ డీడీఏ ధనంజయ రెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధిరాజు కండ్రిగ గ్రామంలో సోమవారం అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యవేడు ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏవో సంజీవిరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'కొత్తగాలి' కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని బైరాగిపట్టెడలో ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మంగళవారం విశ్వశ్రీ సాహితీ సమాఖ్య తిరుపతి వారి ఆధ్వర్యంలో కవి అడిగోపుల వెంకటరత్నం రూపొందించిన 'కొత్తగాలి' కవితాసంపుటిని ఆవిష్కరిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు శ్వేత సంచాలకులు ఏ.ప్రశాంతి ముఖ్య అతిథిగా కవితాసంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, సాహిత్యాభిమానులు తరలిరావాలని ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, కార్యక్రమ సమన్వయకర్త ఆకుల మల్లేశ్వరరావు కోరారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-కేవీబీపురం: శ్రీనివాసపురంలో పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం సత్యవేడు నియోజకవర్గం ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ డిమాండు చేశారు. సోమవారం శ్రీనివాసపురం బాధితులతో కలిసి తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ శ్రీనివాసపురం గ్రామ ప్రజలు గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములను సాగు చేస్తున్నారని..అక్రమంగా పట్టాలు పొంది నేడు పేదలపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు

ప్రజాశక్తి- రేణిగుంట: వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలున గాజులమండ్యం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఎస్సై ధర్మారెడ్డి కథనం మేరకు.. గాజులమండ్యం, ఏర్పేడు, పుత్తూరు, వడమాలపేట తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో వడమాలపేట మండలం కాయంపేటకు చెందిన బోయినపల్లి రమేష్(23), చంద్రగిరి మండలం పైడిపల్లి కి చెందిన గుండ్లూరు ఆదినారాయణ(29) పగులగొట్టి అందులోని రాగి వైర్లను చోరీ చేసేవారు. వారిని సోమవారం గాజులమండ్యం వద్ద అరెస్టు వారి నుంచి రాగి వైర్లను స్వాధీనం చేసుకున్నారు. రిమాండు కు పంపారు.

గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P.No : 48/2022

In the matter of Puvvadi Tejaswini andPuvvadi Harshini Minors Daughter of Puvvadi Rajeswari, 13/232, Gamallapalem, Near Krishnamandiram, Gudur, Tirupati Dt.

Puvvadi Rajeswari ...Petitioner

Vs

NIL. ...Respondent

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరులోని మైనర్స్ అయిన పువ్వాడి తేజస్విని మరియు పువ్వాడి హర్షిణిలకు వారి తండ్రి గారి ద్వారా సంక్రమించిన షెడ్యూలు దాఖల ఆస్తిని అమ్మేందుకు కోర్టు వారి పరిమిషన్ కోరుచున్నందున ఇందు విషయమై ఎవరికైన ఎలాంటి ఆక్షేపణలు ఉన్న ఎడల తేది 06-03-2023న పై కోర్టు ఎదుట ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది.

షెడ్యూలు

ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, గూడూరు రి॥డి, గూడూరు స॥రి, గూడూరు మండలం, గూడూరు మునిసిపాలిటి, తూర్పు గూడూరు పట్టా నెం.548, సర్వే నెం.793-బి, య.1-59 సెంట్లు భూమిలో య 0-53 సెంట్లు భూమి లింకు దస్తావేజుల ప్రకారం పోటుపాళెం పంచాయతీ ప్రస్తుత మునిసిపాల్ లెక్కల ప్రకారం వార్డు నెం.6, పూలతోట ఏరియా ప్లాటునెం.35, 29 అంకణములా 48 చదరపు అడుగులతో ఉత్తర పార్శ్వం 14 అంకణములా 60 చదరపు అడుగులు ఖాళీ స్థలమునకు హద్దులు :
తూర్పు : 18-09 అడుగులు వెడల్పుగా గల రాకపోకల రోడ్డు (20-06 1/2 అడుగులు), దక్షిణం : సి షెడ్యూలు దాఖలు పువ్వాడి నరేంద్ర భాగమునకు రాబడిన ఆస్తి (52-00 అడుగులు), పడమర : తాతా సునీల్‌కుమార్ ఖాళీ స్థలం ప్లాటు నెం.32 (20-06 1/2 అడుగులు), ఉత్తరం : ప్లాటు నెం.36 ఖాళీ స్థలము (52-00 అడుగులు).

టి.రఘురామిరెడ్డి
పిటిషనరు తరపు న్యాయవాది,
గూడూరు.